ఆభరణాలు, నగదును అప్పగిస్తున్న 108 సిబ్బంది

108 సిబ్బంది.. శభాష్

కీసర, ఫిబ్రవరి 10: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడి వద్ద లభించిన బంగారం, నగదును క్షతగాత్రుని కుటుంబీకులకు అప్పగించి 108 సిబ్బంది నిజాయితీని చాటుకున్నారు.కీసర మండల కేంద్రం లోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి ఓ బైక్ అదుపు తప్పి ఓ యువ కుడికి గాయాలు అయ్యాయి. క్షత గాత్రుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఈసీఐఎల్‌కు చెందిన వెంకటరాజు (32) ఆదివారం రాత్రి తోటి స్నేహితులతో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లాలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుపుకొని భువనగిరి నుంచి ఈసీఐఎల్‌కు తన ద్విచక్ర వాహనం మీద వస్తున్నాడు. రాత్రి పదిన్నర గంటల సమయంలో కీసర ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోకి రాగానే తన బైక్ అదుపు తప్పి కల్వర్ట్‌లో పడిపోయింది. వెంకట రాజు తలకు బలమైన గాయాలు అయ్యి ఆపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ విష యాన్ని ఆ మార్గం గుండా వెళుతున్న వారు ఈ సమాచారాన్ని 108 కు అందిం చారు. ఈ సమాచారం అందుకున్న 108 సిబ్బంది చిత్రం రవి, పైలట్ ఆంజనే యులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని తీవ్ర రక్తస్రావంతో ఆపస్మారక స్థితిలో ఉన్న అతని అంబులెన్స్‌లోకి తీసుకొని వెంటనే రక్తస్రావాన్ని ఆరికట్టి ఆక్సి జన్‌ను అందిస్తూ అతని ప్రాణాన్ని కాపాడారు. వారి కుటుంబ సభ్యులకు సమా చారం అందించి నగరంలోని గాంధీ దవాఖానకు తరలించారు. కాగా అతని వద్ద లభించిన బంగారం గొలుసు, బంగారపు ఉంగరం, మొబైల్‌ఫోన్, నగదు రూ.1850 రూపాయలను భద్రపరిచి క్షతగాత్రుని కుమారుడు ధనుంజయ్‌కు అప్పగించారు. 108 సిబ్బంది రవిని వారి కుటుంబ సభ్యులు గాంధీ దవాఖాన వైద్యులు అభినందించారు.

మద్యం మత్తులో కారు నడుపుతూ..

బంజారాహిల్స్,ఫిబ్రవరి 10: పీకలదాకా మద్యం సేవించిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అడ్డదిడ్డంగా కారు నడుపుతూ మూడు చోట్ల ప్రమాదాలకు కారణమ య్యాడు. మణికొండలో నివాసం ఉంటున్న బీవీఎస్.సుధీర్(22) అనే యువ కుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుంటాడు. ఆదివారం రాత్రి తెల్లాపూర్‌లో స్నేహితుడి ఇంట్లో పార్టీ చేసుకున్న సుధీర్ పీకలదాకా మద్యం సేవించాడు. అర్ధ రాత్రి దాటిన తర్వాత తన ఎకో స్పోర్ట్స్ కారులో ఇంటికి బయలుదేరాడు. ఓయూ కాలనీ మీదుగా మణికొండ వైపుకు వెళ్తున్న క్రమంలో వేగంగా వెళ్తూ రోడ్డుపక్కన బైక్ వద్ద నిలబడిన భారతమ్మ, శ్రీకాంత్ అనే తల్లీ కొడుకులను ఢీకొ ట్టాడు. దీంతో స్థానికులు కారును ఆపేందుకు యత్నించగా పారిపోయే క్రమంలో సాయి అనే జొమాటో బాయ్‌ను ఢీకొట్టింది. మరింత ముందుకు వెళ్లి తారిఖు ద్దీన్ అనే వ్యక్తి బైక్‌ను ఢీకొట్టింది. అదే వేగంతో వెళ్లి ఫుట్‌పాత్ మీదకు ఎక్కి ఆగి పోయింది. ఈ ఘటనలో నిందితుడు సుధీర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతడికి బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా మద్యం తాగినట్టు నిర్ధారణైంది. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

దివాన్ దేవిడిలో భారీ అగ్నిప్రమాదం

45 బట్టల దుకాణాల్లో వస్త్రాలు బుగ్గి
6 కోట్ల వరకు నష్టం

చార్మినార్, ఫిబ్రవరి 10 : నిత్యం వర్తక వ్యాపార నిర్వ హణలో కిక్కిరిసి, ఇతర ప్రాంతాల నుండి కొనుగోళ్లకు వచ్చే వారితో రద్దీగా ఉండే దివాన్ దేవిడిలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కాగా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకున్న ఈ ఘట నపై స్థానికులు, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దివాన్ దేవిడి లోని అబ్బాస్, మదీనా టవర్ లో సుమారు 400ల వరకు రెడీమేడ్ వస్త్ర వ్యాపా రాలు నిర్వహించే హోల్ సెల్ దుకాణాలు కొనసాగుతు న్నాయి. ఆదివారం రాత్రి కొన్ని దుకాణాల నిర్వాహకులు తమ కార్యకలాపాలు ముగించుకుని వెళ్లిపోయారు. సోమ వారం తెల్లవారు జామున సుమారు 2గంటల ప్రాంతంలో 4వ అంతస్తులో మంటలు రావడం గమనించిన వాచ్‌మెన్ వెంటనే మొఘల్‌పుర అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మాటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమించారు. అప్పటికి మంటలు అదుపులోకి రాక పోవడం తో జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్న ఆదేశాలతో హై కోర్ట్, యాకుత్ పుర, సికింద్రాబాద్, మల్కాజ్ గిరి, మలక్ పేట్, సౌలర్ జంగ్‌మ్యూజియం, రాజేంద్రనగర్ ఏరి యాల నుండి అగ్ని మాపక శకటాలను రప్పించి మంటలను

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అదుపుచేయడానికి ప్రయత్నించారు. అగ్ని మాపక శాఖకు చెందిన సుమారు 60 మంది సిబ్బంది మంటలను అదుపు లోకి తీసుకురావడానికి శ్రమించారు. 4వ అంతస్తులో రాజ కున్న మంటలు క్రమేణా సెల్లార్ లోని రెండో గ్రౌండ్ లోని దుకాణాల వరకు వ్యాపించాయని అధికారులు తెలిపారు.

400 దుకాణాలు

అబ్బాస్, మదీనా టవర్‌లోని వస్త్రసముదాయల్లో వ్యాపా రులు చిన్న చిన్న దుకాణాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గదులు ఇరుకుగా ఉండడం వల్ల రాజకుంటున్న ప్రాంతాలను చేరుకోవడం సిబ్బందికి కష్టంగా మారింది. అప్పటికే దట్టమైన పొగ వ్యాపించడం, భారీగా మంటలు ఎగిసి పడుతున్నందున 8 ప్రాంతాల నుండి అగ్ని మాపక శకటలను సంఘటన స్థలా నికి రప్పించామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న తెలిపారు. కాగా 400 వరకు దుకాణాలు ఉన్న ఈ సముదా యంలో అగ్నిప్రమాదాల నుంచి రక్షణ చర్యలు ఏవీ లేవని గుర్తించినట్టు ఆయన తెలిపారు. మంటలు వ్యాపించిన భవ నంలో వాచ్‌మెన్‌తో పాటు అయన కుటుంబం పై అంతస్తులో నివసిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది కుటుంబ సభ్యులను గుర్తించి వారిని సురక్షితంగా కాపాడి కిందికి తీసుకువచారు పక్క భవనంలో మరో 15మందిని గుర్తించిన సిబ్బంది ముందు జాగ్రత్తగా వాళ్లను కూడా అక్కడి నుండి తరలిం చారు. సుమారు 60 కోట్లవరకు ప్రాథమికంగా అస్తి నష్టం జరి గిందని గుర్తించినట్లు నిర్వాహకులు తెలిపారు. షార్ట్‌స ర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెప్పారు. సంఘటన స్థలాన్ని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ, ఫైర్ డీజీ జీ వి నారాయణ, అదనపు డీజీ ప్రసన్న కుమార్, డీసీపీ స్నేహ మిశ్రా, ఏసీపీ చంద్రశేఖర్,రీజినల్ ఫైర్ అధికారి హరినాథ్ రెడ్డి, అసిస్టెంట్ డిస్టిక్ ఫైర్ అధికారులు ప్రభాకర్ రెడ్డి, షణ్ముఖ రావు, రఫీ తదితరులు సందర్శించారు.

సెబీ గుర్తింపు పొందిన యాప్‌లలోనే పెట్టుబడులు పెట్టండి

డిస్ప్లేలో లాభం చూపించి 21లక్షలు కొట్టేసిన నేరగాళ్లు
షేర్లలో పెట్టుబడి పేరుతో వృద్ధుడి ట్రాప్..!

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10(నమస్తే తెలంగాణ): కనీవినీ ఎరు గని లాభాలొచ్చాయంటూ యాప్ డిస్ప్లేలో లక్షలకు లక్షలు లాభాలు చూపించి అది నిజమేనని నమ్మించి ఓ వృద్ధుడి వద్ద నుంచి సైబర్ నేరగాళ్లు 21 లక్షలు కొట్టేశారు. పెట్టుబడి-లాభాల పేరుతో పెద్ద ఎత్తున మోసం జరిగిందని నిజం గ్రహించి చివరికి ఆ వృద్ధుడు పోలీసులను ఆశ్రయించాడు. అందుకే సెబీ వద్ద గుర్తింపు పొందిన యాప్‌లలోనే పెట్టుబడులు పెట్టాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన 73ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి షేర్‌ఖాన్ స్టాక్ ఇన్వెస్టింగ్ కంపెనీ సీఐఓ పేరుతో ఒక నెంబర్ నుంచి రెండు రోజుల కిందట మెసేజ్ వచ్చింది. ఈ మెసేజ్ చూసిన తర్వాత బాధితుడికి సంబంధించిన ట్రేడింగ్ యాప్ ఐడీ, పాస్‌వర్డ్ సృష్టించాడు. అప్పుడు సైబర్ నేరగాడు బాధితుడిని డెంటా వాటర్ అండ్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ లిమిటెడ్ లో పెట్టుబడి పెట్టమని సలహా ఇవ్వడంతో బాధితుడు రూ.50వేలు పెట్టి 400 షేర్లను కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన డబ్బులు బాధితుడి బ్యాంక్ అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్ల అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యాయి. బాధితుడికి షేర్లు కేటాయించి, తర్వాత www. sharekhanedge. com వెబ్‌సైట్ ద్వారా నష్టానికి విక్రయించారు. ఆ తర్వాత మరోసారి జీబీ లాజిస్టిక్స్ కామర్స్ లిమిటెడ్ కోసం దరఖాస్తు చేయమని చెప్పడంతో 4వేల షేర్లను రూ.1లక్షకు కొనుగోలు చేశాడు. ఆ తర్వాత అగర్వాల్ హెల్త్ కేర్ లిమిటెడ్ షేర్లను రూ.21లక్షలు పెట్టి తీసుకున్నాడు. ట్రేడింగ్‌లో లాభంతో కలిపి డిస్ప్లేలో రూ.22.5లక్షలు చూపించగా.. సైబర్ నేరగాళ్లు బాధితుడిని మరి కొంత మొత్తాన్ని చెల్లించాలని చెప్పాడు. మొత్తాన్ని విత్‌డ్రా చేయాలంటే ముందు లాభంలో 35శాతం ఇవ్వాలని డిమాండ్ చేయగా.. అతను ఒప్పుకోలేదు. ఆ తర్వాత తన అకౌంట్‌లో ఉన్న మొత్తం డబ్బులను విత్ డ్రా చేయాలని బాధితుడు ప్రయ త్నించాడు. కానీ అదనపు డబ్బులు చెల్లిస్తేనే మీ డబ్బులు వస్తా యని చెప్పడంతో ఇది మోసంగా భావించిన ఆ రిటైర్డ్ ఉద్యోగి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. పెట్టుబడి కోసం సెబీ ఆమోదించిన యాప్‌లను మాత్రమే ఉపయోగించాలని, సైబర్ క్రైమ్ మోసానికి గురైన బాధితులు వెంటనే 1930కు కాల్ చేయాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

మస్తాన్‌సాయికి 2 రోజుల కస్టడీ

మణికొండ, ఫిబ్రవరి 10: యువతుల ప్రైవేటు వీడియోలు తీయడమే కాకుండా రాజ్‌తరుణ్ భార్య లావన్యపై దాడిచేసిన ఘటనలో అరెస్టైన మస్తాన్‌సాయికి రెండు రోజుల పోలీసు కస్టడీకి అనుమతిస్తూ రాజేం ద్రనగర్ కోర్టు సోమవారం ఆదేశాలు జారీచే సింది. మస్తాన్‌సాయిని విచారణ నిమిత్తం 5రోజుల కస్టడీకి అనుమతించాలని కోరుతూ నార్సింగి పోలీసులు న్యాయస్థానంలో పిటీ షన్ వేసిన విషయం తెలిసిందే. దీనిపై విచా రించిన న్యాయస్థానం ఈనెల 13, 14న రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి అను మతి ఇచ్చింది.

చిలుకూరు కేసులో మరో ఐదుగురు అరెస్ట్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి చేసిన కేసులో మరో ఐదుమంది నిందితులను అరెస్టు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే....తూర్పు గోదా వరి జిల్లాకు చెందిన కొవ్వూరి వీర రాఘవరెడ్డి(45) 2022లో ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా 'రామ రాజ్యం'ను ప్రారంభించాడు. ఈ క్రమంలో భగ వద్గీ శ్లోకాలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో పాటు హిందూ ధర్మాన్ని రక్షించేందుకు రామరాజ్యం సైన్యంలో చేరా లని ప్రజలను ప్రోత్సహిస్తున్నాడు. అంతే కాకుండా ఈ సైన్యంలో చేరిన ప్రతి నెలా రూ.20వేల వేతనం చెల్లిస్తామని ప్రక టించి, గత సంవత్సరం సెప్టెంబర్ నుంచి డిసెంబరు మధ్య కాలంలో నియామకాలు చేపట్టాడు. దీంతో 25మంది ఈ సైన్యంలో చేరేందుకు ముందుకు వచ్చారు. కొత్తగా నియామక మైన వారంతా కలిసి గత నెల 24న తణుకులో రామరాజ్యం వ్యవస్థాపకుడైన వీర రాఘవరెడ్డిని కలిశారు. నాలుగు రోజుల తరువాత అందరూ కలిసి కోటప్పకొండకు పయనమయ్యారు. అక్కడికి వెళ్లిన తరువాత ఒక్కొక్కరు 2వేల చొప్పున వెచ్చించి నలుపు రంగుతో కూడిన యూనిఫామ్‌లను కుట్టించుకున్నారు. ఆ తరువాత ఈనెల 6న యాప్రాల్‌లోని ఒక నివాసంలో అందరూ యూనిఫామ్ ధరించి, రామరాజ్యం సంస్థ బ్యాక్‌గ్రౌం డ్‌తో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. ఈనెల 7న అందరూ కలిసి మూడు వాహనాల్లో చిలుకూరు బాలాజి దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం బాలాజీ దేవాలయం ప్రధాన అర్చ కులు రంగరాజన్ వద్దకు వెళ్లి, తమ సంస్థకు ఆర్థికంగా అండగా ఉండాలని, రామ రాజ్యం సైన్యంలో జనాలను చేర్పించాలని బెదిరించారు. అందుకు రంగరాజన్ అంగీకరించకపోవడంతో తీవ్ర పదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. దీంతో ఈనెల 8న బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, ప్రధాన నిందితుడైన వీర రాఘవరెడ్డిని అదేరోజు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కాగా తాజాగా సోమ వారం మరో ఐదు మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిం చారు. అరెస్టైన వారిలో నిజామాబాద్, ఖమ్మం ప్రాంతాలకు చెందిన ఇద్దరు మహిళలు ఉన్నట్లు డీసీపీ వెల్లడించారు.

నైపర్‌లో సెంట్రింగ్ మేస్త్రీ దుర్మరణం

బాలానగర్, ఫిబ్రవరి 10 : బాలానగర్ పారిశ్రామికవాడలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా స్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్)లో ఓ సెంట్రింగ్ మేస్త్రీ ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుండి మొదటి అంతస్తులో పడి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. సిఐ నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం..... మధ్య ప్రదేశ్ రాష్ట్రం, మెహందీ వాడ, సంజయ్‌చౌక్కు చెందిన నుపేంద్ర నిపానే (45) గత కొంతకాలంగా నిర్మాణంలో ఉన్న ఫార్మా యూనివర్సిటీ పనులలో సెంట్రింగ్ వర్కర్ గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి మొదటి అంతస్తులో పడిపోయాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలై ఆకడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు బాలనగర్ పోలీసులు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నారంటూ..
బ్రిలియంట్ స్కూల్ వద్ద ధర్నా

బోడుప్పల్, ఫిబ్రవరి 10: బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధి లోని వీరారెడ్డి నగర్ కాలనీ శ్రీ బ్రిలియంట్ టెక్నో హై స్కూల్ ప్రిన్సి పాల్, మేడిపల్లి మండల ప్రైవేట్ పాఠశాలల అధ్యక్షులు రవీందర్ రావు విద్యార్థులపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సోమ వారం విద్యార్థి సంఘాలు నిరసన తెలిపారు. ప్రిన్సిపాల్ రవీందర్ రావు గత కొన్నాళ్లుగా తమపై లైంగిక దాడికి పాల్పడుతున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. తమ రూమ్ కి విద్యార్థులు పిలిపించు కొని అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పదవ తరగతి విద్యార్థి ఒకరు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఏబీవీపీ, ఏఐవైఎఫ్ విద్యార్థి నాయకులు ధర్నా చేశారు. కాగా, పరీక్షలు సమీపిస్తున్న వేళ అసభ్యకరమైన వీడియోలు చూస్తూ సమయాన్ని వృథా చేస్తున్న విద్యార్థులను ఆఫీసులోకి పిలిచి మందలించాను తప్ప తాను అసభ్యకరంగా ప్రవర్తించలేదని ప్రిన్సిపాల్ రవీందర్ రావు వివరించారు. విద్యార్థులు తన కూతుర్లు, కొడుకులతో సమాన మని.. తనపై ఆరోపణలు రావడం దురదృష్టకరమన్నారు.

పుట్టిన పిల్లలు చనిపోతున్నారని..

దేవి (ఫైల్)

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10: ఆ దంపతులకు వివాహం జరిగి తొమ్మిదేళ్లు కావస్తున్నది. ఈ క్రమంలో వారికి మొదటి సంతా నమైన పసిపాప పుట్టిన నెలరోజు ల్లోనే అనారోగ్యంతో మృతి చెందింది. ఆ తర్వాత పుట్టిన రెండో పసిబిడ్డ కూడా పుట్టిన వెంటనే స్వల్ప కాలంలోని మృతి చెందింది. ఇలా పుట్టిన పిల్లలు చనిపోతున్నారని ఆ భర్త మనోవే దనకురై మద్యానికి బానిస అయ్యాడు. దీంతో ఆ ఇల్లాలు జీవి తంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నది. పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన కోదండరాం, దేవి(28) లకు 2015లో వివాహం జరి గింది. వివాహ అనంతరం బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి సుభాష్‌నగర్ డివిజన్ అద్దె ఇంటిలో ఉంటూ కోదండరాం ఓ ప్రైవేట్ సంస్థ పనిచేసుకుంటు కాపురం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మొదటిసారి పుట్టిన పసిపాప నెల రోజులు గడవక ముందే అనారోగ్యంతో మృతి చెందింది. మరికొన్ని రోజుల తర్వాత పుట్టిన రెండో బిడ్డ కూడా నెల గడవక ముందే మృతి చెందింది. ఈ ఆవేదనతో భర్త కోదండరాం మానసిక వేదనతో మద్యానికి బానిస అయ్యాడు. పుట్టిన పిల్లలు చనిపోయి, భర్త మద్యానికి బానిస కావడంతో జీవితంపై విరక్తి చెందిన దేవి ఈనెల 9న అర్ధరాత్రి తన భర్త పడుకున్నాక తాము ఉంటున్న రేకుల ఇంట్లో రాడుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసు కుంది. పోలీసులు సోమవారం మృతదేహాన్ని గాంధీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని కార్పెంటర్ మృతి

హిమాయత్ నగర్, ఫిబ్రవరి10: వాటర్ ట్యాంకర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణగూడ లో చోటు చేసు కుంది. ఇన్ స్పెక్టర్ యు. చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం చెంగిచెర్లలో నివాసం ఉండే జగన్నాథన్ చారి (50) కార్పెంటర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం ఆబిడ్స్ లో పనిచేసేందుకు ఇంటి నుంచి పల్సర్ బైక్ పై బయలుదేరాడు. ఈ క్రమంలో నారాయణగూడ క్రిస్టియన్ స్మశాన వాటిక సమీపంలో వాటర్ ట్యాంకర్ వాహనం,ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో జగ న్నాథన్ చారి కింద పడిపోవడంతో వాటర్ ట్యాంక్ వాహనం వెనుక టైరు ఆయన పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలా నికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం జగన్నాథన్ చారి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని కేసును దర్యాప్తు చేస్తున్నారు

సిద్ధార్థ హాస్పిటల్ ఆపరేషన్ థియేటర్ సీజ్

మాదాపూర్, ఫిబ్రవరి (నమస్తే తెలంగాణ)10: 13 లక్షలు దండుకొని బాధితులకు చివరికి శవాన్ని అప్పజెప్పిన సిద్ధార్థ న్యూరో హాస్పిటల్ ఆపరేషన్ థియేటర్‌ను రంగారెడ్డి జిల్లా వైద్యాధి కారి వెంకటేశ్వర్లు సోమ వారం సీజ్ చేశారు. విచా రణ పూర్తయ్యే వరకు కొత్త రోగులను ఎవరినీ చేర్చు కోవద్దని ఆదేశించారు. 13 లక్షలు బిల్లు వసూలు చేసి చివరికి శవాన్ని అప్పగించడంపై, రెండు రోజులుగా కేవలం మృతదేహానికే చికిత్స చేశారన్న రోగి బంధువుల ఆరోపణలపై డిఎంహెచ్‌ఓ వెంక టేశ్వర్లు, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ విజయ పూర్ణిమ, సిబ్బందితో కలిసి విచారణ ప్రారంభించారు. మదీనగూడ లోని సిద్ధార్థ న్యూరో హాస్పి టల్ ను జిల్లా వైద్య బృందం పరిశీలించి దవాఖాన యాజమాన్యంపై తీవ్రంగా మండిపడ్డారు. రోగులు ఎప్పుడు హాస్పిటల్‌లో చేరారు? ఎలాంటి చికిత్స అందించారు? ఎంత బిల్లు ఖర్చైంది? ఆమె ఎప్పుడు చనిపోయింది? వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలు సుకున్నారు. కాగా తాము అడిగిన ప్రశ్నలకు హాస్పిటల్ యాజ మాన్యం చెప్పిన సమాధానాలకు పొంతన లేకపోవడంతో వారిపై డీఎంహెచ్‌ఓ మండిపడ్డారు.చికిత్సకు సంబంధించిన కేస్ షీట్స్ తీసుకొని ఆధారాలు సేకరించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పేషంట్ చనిపోవడానికి కారణమైనట్లు నిర్ధారణ అయితే దాకాన యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటామని వెంకటేశ్వర్లు మీడి యాకు తెలిపారు. ప్రస్తుతం దవాఖానాలో 28 మంది రోగులు ఉన్నారని, విచారణ పూర్తయ్యే వరకు కొత్తగా రోగులెవరినీ చేర్చుకో వద్దని ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం ఆపరేషన్ థియేటర్ ను సీజ్‌చేసినట్లు వెల్లడించారు. మరో రెండు రోజుల్లో లోతుగా దర్యాప్తు చేసి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

మదినగూడ సిద్ధార్థ హాస్పిటల్ పై దర్యాప్తు చేపట్టిన రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

వేలిముద్రలతో డొంకంతా కదిలింది

ఐదేళ్ల నాటి దొంగను ఫింగర్ ప్రింట్స్ పట్టించాయి
జూబ్లీహిల్స్‌లో దోపిడీ చేసి నేపాల్‌కు పారిపోయిన నిందితుడు
తిరిగి వచ్చి సెల్‌ఫోన్ చోరీలు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 10: ఐదేళ్ల క్రితం జూబ్లీహిల్స్‌లోని ఓ బంగ్లాలోకి ప్రవేశించి కత్తితో బెదిరించి దోపిడీ చేసిన నిందితుడు ఫింగర్ ప్రింట్ బ్యూరోలో భద్రపరిచిన వేలిముద్రల కారణంగా పోలీసులకు పట్టుబడ్డాడు. ఇటీవల ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 50 సెల్‌ఫోన్లు తస్కరించిన నిందితుడే జూబ్లీ హిల్స్ దోపిడీ కేసులో నిందితుడని అతడి వద్దనుంచి సేకరించిన ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా గుర్తించిన జూబ్లీహిల్స్ పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందిన గోవింద్ బండారీ అలియాస్ పదమ్ భండారీ (24) అమీర్‌పేటలో ఫాస్ట్‌ఫుడ్ సెంట ర్‌లో పనిచేస్తుండేవాడు. జల్సాలకు అలవాటు పడిన గోవింద్ భండారీ 2019 డిసెంబర్‌లో మరో స్నేహితుడు రాజేష్ ఛత్రీ అనే వ్యక్తితో కలిసి జూబ్లీహిల్స్ రోడ్ నెం 18లోని ఓ ఇంట్లోకి రాత్రి పూట ప్రవేశించి కత్తితో ఇంట్లోని ఒంటరిగా ఉన్న ఓ యువతిని బెదిరించాడు. ఆమె వద్దనుంచి రూ.45వేల నగదుతో పాటు బంగారు గొలుసు, వజ్రపు ఉంగరం, సెల్‌ఫోన్, ఏటీఎమ్ కార్డులు దోపిడీ చేసి పారిపోయాడు. ఆ తర్వాత నెల రోజులకు బీహెచ్‌ఈ ఎల్ సమీపంలోని ఆశోక్ నగర్‌లో గ్రామీణ వికాస్ బ్యాంక్ గ్రిల్స్ గ్యాస్ కట్టర్ ద్వారా కట్ చేసి చోరీకి విఫల యత్నం చేశాడు. అయితే పోలీసులు పట్టుకుంటారనే భయంతో నేపాల్‌కు వెళ్లిపో యాడు. నేపాల్‌లో ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఏడాది క్రితం తిరిగి భార్యతో కలిసి నగరానికి వచ్చాడు. కేపీహెచ్‌బీలో నివాసం ఉంటూ అదే ప్రాంతంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వంటమ నిషిగా పనిచేస్తున్నాడు. కాగా గత కొంతకాలంగా ఎస్ఆర్ నగర్ పీఎస్ పరిధిలోని పలు హాస్టళ్లలో గోవింద్ భండారీ సెల్‌ఫోన్లను తస్కరించాడు. ఇటీవల ఎస్ఆర్‌నగర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రెండునెలల వ్యవధిలోనే 13కేసుల్లో సుమారు 50 కి సైగా సెల్‌ఫోన్లు చోరీ చేసినట్లు గుర్తిం చిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు గోవింద్ భండారీ వేలిముద్రలు ఫింగర్ ప్రింట్స్ బ్యూరోలో భద్రపర్చారు. వాటిని పరిశీలిస్తున్న క్రమంలో జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు తమ పీఎస్ పరిధిలో 2019లో జరిగిన దోపిడీ కేసులో సేకరించిన వేలిముద్రలతో గోవింద్ భండారీ వేలిముద్రలు సరిపోలినట్లు గుర్తించారు. దీంతో ఎస్ఆర్‌నగర్ పోలీసులను సంప్రదించగా భండారీ అరెస్ట్ అయిన విషయాన్ని గురించి జూబ్లీహిల్స్ పోలీసులకు తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల జైలునుంచి విడుదలయిన గోవింద్ భండా రీని జూబ్లీహిల్స్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్ బృందం సోమ వారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఐదు కోట్ల విలువైన డ్రగ్స్ దహనం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ డివిజన్ పరిధిలోని 9ఎక్సైజ్ స్టేషన్‌లలో నమోదైన 150 కేసుల్లో పట్టుబడిన రూ.5కోట్ల విలువ చేసే డ్రగ్స్, గంజాయిని ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్ ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌లో 10కేసులు, చార్మినార్ స్టేషన్‌లో 10కేసులు, ధూల్‌పేట స్టేషన్‌లో 62కేసులు, గోల్కొండ స్టేషన్‌లో 12కేసులు, జూబ్లీహిల్స్ స్టేషన్‌లో 16కేసులు, మలక్ పేట స్టేషన్‌లో 4, నాంపల్లి స్టేషన్‌లో 25, కాచిగూడ స్టేషన్‌లో 2, సికింద్రాబాద్ స్టేషన్‌లో 9కేసులు డ్రగ్స్, గంజాయికి సంబంధించి నమోదయ్యాయి. ఈ కేసుల్లో పట్టుబడిన వివిధ రకాలు డ్